# సాహచర్యం

"ఏవిటలా చూస్తున్నారు?" యువతి అడిగింది, వినిపించి వినిపించనటు.

"అసలే అందంగా కదిలే నీకళ్ళు బండి కుదుపుకు మరింత అందంగా కదులుతున్నాయి" రహస్యం పలుకుతున్నటుంది అతని జవాబు.

"పర్వాలేదే అత్తవారిల్లు దగ్గరవడుతున్నకొద్దీ అల్లుడుగారికి కవిత్వం దొర్లుకొస్తోంది" విమర్శగా అంది.

"బాల్లే, మరీ తొందర పెట్టేశావ్. రేపొస్తామని నాచేత వుత్తరం రాయించి ఇవ్వాళే లాకొచ్చావ్" ననిగాడు.

"వస్తే యేమయిందిట? మనల్ని చూసి అమ్మా నాన్నా యెంత ఆశ్చర్యపోతారో తెలుసా!"

"అందుకని మనంతట మనమే స్టేషన్నుంచి ఖులారావడమేనా?"

"ఎందుకు రాకూడదూ, మీకు స్వాగతం చెప్పాలా. నేనున్నాగా వెంట, పోనీ యింటిదగ్గర స్వాగతం చెబుతాలెండి."

వారి మాటలు ఆగిపోయాయి.

అతను ఆమె సోగకళ్ళలోకి చూస్తూ ఆనందలోకాల్లో విహరిస్తున్నాడు. ఆమెలో ఎన్నో మధురోహలు విరిశాయి. కళ్ళు మౌనంగా మాట్లాడుకుంటున్నాయి.

బండితోలే రహీం గుర్రాన్ని అదిలించాడు. "చల్ బేటా" అంటూ చర్నాకోల చక్రానికి సుతారంగా తగిలించి టక టక శబ్దం చేశాడు.

ఆ శబ్దం యువకుడికి చిత్రంగా వినిపించింది.

బండి వేగానికి ఆమె దగ్గరగా వచ్చింది ఆమె చేతిని అతను మృదువుగా స్పృశించాడు కనుబొమ్మలు కదిలించి మందలిస్తూ చేయి వెనక్కి తీసుకుంది.

ఈ మాదిరి సంఘటనలూ, సంభాషణలూ రహీంకు ఎప్పుడూ వినిపిస్తూనే వుంటాయి. అయితే ఒకరోజు ముందుగా అత్తవారింటికి వెళ్ళామని బేగమున్నిసా పట్టుపట్టి చిన్నప్పుడు తనను తీసుకువెళ్ళడం గుర్తుకొచ్చింది. పండిన అతని మనస్సులో చిత్రంగా మల్లెలు విచ్చుకున్నట్లయి లోలోపల నవ్వుకున్నాడు.

రామానగరం రైలు స్టేషన్‌కూ ఊరికీ మధ్య మైలున్నర దూరం రహీం జట్కాను ప్రతివారూ ఇట్టే గుర్తుపడతారు. అతనంటే అందరికీ. అభిమానం వినయం అతని సొత్తు. నిజాయితీకి రహీం మారుపేరు.

"అమ్మాయిగారూ! మీరు బలే పనిచేశారండి. పెద్దయ్యగారు మిమ్మల్ని చూసి ఉబ్బితబ్బిబ్బవుతారు. కాని స్టేషనుకు ఎవరూ రాకుండా...!

"నువ్వుంటావని తెలుసుగా రహీం, నువ్వు మాకు పరాయివాడివా?

ఆమె మాటల్లోనే ఆత్మీయతకు అతని కళ్ళలో ఆనందబాష్పాలు పొంగి వచ్చాయి ధన్యుణ్ణి అనుకున్నాడు "ఇంకే సంపదా అక్కర్లేదు. మంచిమాట చాలు" రామానగరం ప్రజల గుండెల్లో తనకున్న స్థానం అలాగే నిలుపుకోవాలని అతని ప్రగాఢాశయం.

తెప్పరిల్లి "మీరు వస్తున్నట్టు తెలిస్తే రెండెడ్లబండిని ముస్తాబు

చేయించి పెద్దయ్యగారే స్వయంగా అల్లుడిగారికోసం స్టేషన్‌కు వచ్చేవారు.

"నాకు మాత్రం నీ బండి బావుంది. రహీం కదూ నీ పేరు.... చూడు రహీం; ఈవిడగారు స్టేషనుబయటికి రాగానే నీ బండి ఎక్కేసింది. నీ స్వాగతమే బావుంది" యువకుని మాటలు నవ్వుల్లో కలిసిపోయాయి.

"వచ్చేశాం అబ్బాయిగారు" అంటూ రహీం క్రిందికి దూకి బండి కదలకుండా పట్టుకున్నాడు. వాళ్ళిద్దరూ నెమ్మదిగా దిగారు. పెట్టెబుట్ట పట్టుకుని రహీం లోపలికి దారితీశాడు. వరండాలో దించి 'అమ్మగారూ' అని పిలిచాడు.

యువకుడు అయిదు రూపాయలు రహీంచేతికిచ్చాడు. రహీం మూడు రూపాయలు తిరిగి ఇవ్వబోయాడు.

"ఉంచు" అతను తీసుకోలేదు.

'కాదు అబ్బాయిగారూ, ఎక్కువ తీసుకోవడం ఈ రహీంకు తెలియదు."

"రహీం, ఆయన సంతోషంతో ఇస్తున్నారు. వద్దనకు"

"కాదమ్మాయిగారు...."

"చూడు రహీం, ఈ మూడు రూపాయిలతో ఇవ్వాళ బేటాకు స్పెషల్ తినిపించు" అన్నాడు యువకుడు.

"నే నుండగా దానికి లోటు రానీను అబ్బాయిగారూ! అది తిన్నాకే మేం తినేది" అన్నాడు అయినా రహీం వాళ్ళ మాట కాదనలేకపోయాడు.

ఈ లోగా తలుపుతీసి పెద్దమ్మగారు వచ్చి ఆశ్చర్యంలో 'అమ్మాయ్, మీరా, రండి, రాబాబు, రేపొస్తామని రాశారుగా' అంటూ ఇంట్లోకి దారితీసింది.

రహీం వాళ్ళ దగ్గర సెలవు తీసుకుని జట్కాదగ్గరికి వచ్చాడు.

"పదబేటా, ఇవాళ్ళ నీకు భాగా ఉలవలు తినిపిస్తా" వెళ్ళేదార్లో ఉలవలు కొన్నాడు.

జేగమున్నిసాకు అంతా చెప్పి గుగ్గిళ్ళు వేయమన్నాడు. "ఒకసారి స్టేషనుకు వెళ్లొస్తా" అని చెప్పి జట్కా తోలుకెళ్ళాడు.

తర్వాత రైలు వచ్చేదాకా వుండి సవారి ఎక్కించుకుని వూళ్ళోకి వచ్చాడు. ఇంటికి రాగానే గుర్రానికి జీను తీసి లోపలపెట్టి దాణాబుట్ట తెచ్చాడు. "తినరా బేటా బాగాతిను" అని ఆనందంతో బేగాతో మాట్లాడుతూ గుగ్గిళ్ళు తినిపించాడు.

* * *

మంచంలో ఒళ్ళు తెలియకుండా పడివున్న రహీం ఉన్నటుండి గట్టిగా ఏదో మాటాడం వినిపించి బేగమున్నిసా పరిగెత్తికొచ్చి చూసింది. కళ్ళు మూసుకునే వున్నాడు. ఎండిపోయిన పెదవులపైన చిరునవ్వు కదల లేక కదులుతోంది.

కొడుకు సలీం కూడ గాబరాతో వచ్చి నిలబడ్డాడు. ఏదో పలవరిస్తున్న రహీం వైపు కొండుంత దిగులుతో చూస్తుండిపోయారు. ఊళ్లో వున్న డాక్టరు మందలిస్తున్నాడు జ్వరం తగ్గలేదు. వయస్సు మళ్ళిన

తండ్రి సలీంకు దైవంలా కనిపించాడు నిజమే. రహీం అందరిలాంటి వాడు కాదు. కష్టించి సంపాదించడం తప్ప, అన్యాయం అంటూ ఎరగడు. బేటా అతనికి ప్రాణంతో సమానం. నోరు లేకపోయినా బేటాకు మనసు వుందని రహీం నమ్మకం. స్వయంగా మాలీషుచేసి ఎప్పుడూ శుభ్రంగా వుంచే అలవాటు ఎన్నడూ బేటాను కొట్టి ఎరగడు. దానితో అనేక రకాలుగా మాట్లాడతాడు.

అతని మాటలు బేటాకు అర్థమవుతాయి చెప్పినటు వింటుంది. ఎలా పొమ్మంటే అలా పోతుంది. రహీంలాగే దానికీ మునపటి బలం లేదు. బండి కూడ పాతదయింది. రామానగరం కూడ పెరిగింది. రహీం ఆ బండితోనే జీవనం సాగిస్తున్నాడు.

బేగమున్నీసా భర్త పరిస్థితి చూసి బెంబేలు పడింది. చకచకా వెళ్లి ప్రక్కనే వుంటున్న నాంచారయ్యను పిలుచుకొచ్చింది. అతను వెళ్ళి డాక్టర్ని వెంటబెటుకొచ్చాడు.

డాక్టరు పరీక్ష చేశాడు.

"ఎలావుంది మా రహీంకు? అని నాంచారయ్య ఆందోళనతో అడిగాడు.

"పట్నం ఆసుపత్రికి తీసుకువెళ్తే అన్ని సదుపాయాలువుంటాయి అని సూచించి వెళ్ళిపోయాడు.

రహీం మూలుతూ కళ్లు తెరిచాడు.

"ఎలావుంది ఒంట్లో", నెమ్మదిగా అడిగింది బేగమునుసా.

"బేటాకు దాణావెట్టావా?" అని ఎలాగో మాట వెగుల్చుకుని అడిగాడు రహీం, మళ్ళీ కళ్లు మూసుకున్నాడు.

ముగ్గురూ సంప్రదించుకుని వెంటనే పట్నం తీసుకు వెళ్లేందుకు నిర్ణయించారు. బేగమున్నిసా సామాను సర్దింది. నాంచారయ్య ఇంట్లో చెప్పివస్తానని వెళ్ళాడు.

బేటా రహీంను చూసి అప్పటికి రెండు రోజులయింది. చాలా సార్లు అతని కోసం సకిలింది.

నాంచారయ్య కుటుంబం అంతా అక్కడికి వచ్చారు. సలీం, నాంచారయ్యతోడు పట్టి రహీంను జట్కాలో ఎక్కించి పడుకోబెట్టారు. ఎక్కే ముందే రహీం కళ్ళు తెరిచి బేటాను చేతిలో నిమిరాడు బేటా ఏదో సకిలించింది.

బేగమున్నిసా, నాంచారయ్యకూడ ఎక్కారు. సలీం జట్కా ముందుకు నడిపించాడు.

మధ్య మధ్య పెద్దగా సకిలిస్తూ బేటా వేగంగా పట్నం వైపు పరుగు తీయసాగింది. దానిలో రహీంకు స్పృహవచ్చినప్పుడు బేటా సకిలింపు విన్నాడు. తానిప్పుడు దానిబాధ తీరేస్థితిలో లేదు. దానితో మాట్లాడాలి, దానిని అనునయించాలి, బుజ్జగించాలి. కాని తనకా శక్తిలేదు.

పట్నం ఆసుపత్రి వచ్చింది.

బండి ఆపి రహీంను లోపలికి తీసుకు వెళ్ళబోతుంటే రహీం రెప్పలు పెగుల్చుకుని బేటా నడుంపై చేయివేసి ఏదో చెప్పేయత్నం చేశాడు.

అతను వెల్తున్న వైపే చూస్తూ నిలబడింది బేటా, కాసేపయ్యాక సలీం వచ్చి బేటాకు పచ్చిగడ్డి వేశాడు బేటా దానిని ముట్టలేదు. నాంచారయ్య, సలీం అదరబాదరగా బయటికి వచ్చినప్పుడల్లా బేటా వాళ్ళవైపు చూసేది.

మూడు గంటలు గడిచాయి.

తలవాల్చుకుని సలీం బేటా దగ్గరకు వచ్చి బండికట్టాడు. అతని కళ్ళ వెంట నీళ్ళు కారుతున్నాయి బేటా అతణ్నిచూసి కుమిలిపోయింది.

లోపట్నుంచి రహీంను తీసుకువచ్చాడు. పైన బట్టకప్పి వుంది. బండిలో వడుకోబెట్టారు. నాంచారయ్య, బేగమున్నిసా, సలీం విలపించసాగారు.

బట్కా కదిలింది.

బేటా అర్తనాదం వారి రోదనను వినిపించకుండా చేసింది

రామానగరం పొలిమేరలోనే అందరికి తెలిసిపోయింది. రహీం కన్నుమూసిన సంగతి. ఊళ్లాకి రాగానే జనమంతా జట్కావెంట రాసాగారు. ఊరంతా తరలి వచ్చింది. అందరి నయనాలు అశ్రుపూరితాలయ్యాయి.

జట్కా ఇల్లు చేరింది. రహీం కళేబరాన్ని అరుగుమీద పడుకోపెట్టారు.

తర్వాత సలీం వచ్చి బేటాపై రెండు చేతులూవేసి కౌగలించుకుని పెద్దగా ఏడ్వసాగాడు. ఈసారి బేటా సకలించలేదు. బేటా గొంతే కాదు. కళ్ళు కూడ తడి ఆరిపోయాయి. కళ్ళు నెమ్మదిగా మూతపడ్డాయి బేటా నేలకొరిగి పోయింది.

సలీం “బేటా” అని బావురుమన్నాడు.